పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# పుంత రోడ్ల నిర్మాణానికి రూ. 1.71 కోట్లు మంజూరు

## - తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



తణుకు, మార్చి 24 ( ప్రభాత వార్త) : తణుకు నియోజకవర్గంలో రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు తణుకు, అత్తిలి ఏఎంసీల పరిధిలో పుంత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 6 పుంత రోడ్ల నిర్మాణానికి రూ. 1.71 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. తణుకు మండలం మండపాక గ్రామంలో రూ. 23 లక్షలు, అత్తిలి మండలం వరిఘేడులో రూ. 34 లక్షలు, ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు రూ. 49, కంతేరులో రూ. 12.50 లక్షలు, అత్తిలి మండలం మంచిలి రూ. 44 లక్షలు, ఉనికిలి రూ. 8.50 లక్షలు చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పుంత రోడ్లు నిర్లక్ష్యం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుంత రోడ్లు నిర్మాణంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పుంత రోడ్లు నిర్మాణం త్వరలోనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

# మార్చి 25నుంచి సదరం స్లాట్ బుక్కింగ్ దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మర్చి 24 ప్రభాతవార్త : జిల్లాలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీని మరింత పారదర్శకంగా, సులభతరం చేయడానికి డిజిటల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు మార్చి 25 నుండి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం కానుందని వెల్లడించారు. దివ్యాంగత్వ నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం మార్చి 30, 31 తేదీలతో పాటు ఏప్రిల్, మే నెలల్లో కూడా టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో హాజరై పరీక్షలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇకపై సదరం సర్టిఫికెట్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే జారీ చేయబడతాయని తెలిపారు. దీంతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న కుష్ఠు నయం, దృష్టి లోపం, వినికిడి లోపం, లోకోమోటర్ (చలనం) వైకల్యం, మానసిక వైకల్యం, మల్టిపుల్ డిసేబిలిటీ, ఆటిజం తదితర 21 రకాల వైకల్యాలతో పాటు, తాజాగా మరిన్ని వైకల్యాలను కూడా జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ముఖ్యంగా యాసిడ్ దాడి బాధితులు, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ డిసార్డర్, అభ్యాస వైకల్యం, ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్, బహుళ వైకల్యం వంటి కొత్త కేటగిరీలను చేర్చడం ద్వారా మరింత మంది అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం కలగనున్నదన్నారు. సదరం సర్టిఫికెట్ పొందాల్సిన అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సర్టిఫికెట్లు పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# పంట పండించేది రైతు - ధర నిర్ణయించేది దళారీ

## - మొక్కజొన్న యార్డు కోసం రైతన్న ఎదురుచూపులు



ప్రభాతవార్త చాట్రాయి : ఆరుగాలం శ్రమించి రైతులు పంట పండిస్తే ధర నిర్ణయించేది దళారులే అనటంలో సందేహం లేదు. రైతు ఏ పంట పండించిన ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన దళారులు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయటం అనుమతిగా వస్తోంది. రబీ సీజన్ లో చాట్రాయి మండలంలో 12 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. మొక్కజొన్న పంట చేతికి వస్తుండగా ప్రభుత్వం క్వింటాలకు 2400 రూపాయలు మద్దతు ధర ప్రకటించగా దళారులు రైతులు వద్ద కేవలం 1600 రూపాయలకే కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో రైతులు పండించిన పంటకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుందని నువ్వు రావేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు పెట్టి మొక్కజొన్న కొనుగోలు చేయడంతో రైతులకు మేలు జరిగిందని అంతేకాకుండా దళారులు దిగివచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేశారు. ఏడాది కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో మొక్కలు ఉన్న ఇంకొక 15 రోజుల్లో ముమ్మరంగా చేతికి వచ్చే అవకాశాలు ఉన్నందున తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. మంత్రి దృష్టికి : ఇటీవల చాట్రాయి మండలానికి వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారధికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై మండల నేతలు విన్నవించగా త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలపై కోటి ఆశలు పెట్టుకున్నారు.

# క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణంలో

## ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : వైద్యాధికారుల పిలుపు



భీమవరం టౌన్ మార్చి 24 : ప్రభాతవార్త : క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, భీమవరం ఏరియా ఆసుపత్రి నందు సదస్సు నిర్వహించారు. మార్చి 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు అవగాహన సదస్సులు నిర్వహించారు ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ టిబి మందులు అందివ్వడంతోపాటు, అదనపు పోషకాహారం దాతల ద్వారా పూర్తిగా ఆరు నెలల పాటు అందిస్తారు. కఫ దోషం ఉంటే మందులు వాడుతున్న టిబి వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు మరియు సేవ చేసే వారికి వ్యాధి సోక కాకుండా టి పి టి (టిబి నివారణ వైద్యం) పూర్తిగా ఉచితం. గత 20 రోజులుగా జరిగిన టీబీ నివారణ సదస్సులలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు భవ్య సంస్థ సహకారం అందించింది. క్రమం తప్పకుండా మందులు వాడుతున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నంగా క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించాలని, వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా క్షయ నివారణ అధికారి కోరుచున్నారు. ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీ క్షయరహిత గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుంది దీనిలో భాగంగా ప్రతి గ్రామంలోనూ హై రిస్క్ పాపులేషన్ మరియు ప్రమాదానికి గురి అవడానికి అవకాశం ఉన్న ప్రజలకు ముందుగానే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం వలన క్షయ రహిత గ్రామం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎటువంటి లక్షణాలు కనిపించినా వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు పూర్తిగా మందులు వాడితే నయమవుతుందని అధికారులు తెలియజేస్తున్నారు . నిక్షయ మిత్రలు, మరియు ప్రతిభ కనబరిచిన వారికి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి గీతా బాయి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం రవిబాబు , భీమవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ జీతానంద్, ఆర్ ఎం ఓ, డాక్టర్ ప్రవీణ్, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ ఎం గోవిందబాబు, డాక్టర్ వి రాంబాబు, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆర్ విద్యానంద్, జిల్లా డాట్ ప్లస్ సూపర్వైజర్ పి సత్యనారాయణ, ఉద్యోగులు టిబి ఉద్యోగులు, మరియు ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# పశువైద్య శిబిరాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది

## -బలే యేసురాజు



కైకలూరు మార్చి 24 (ప్రభాతవార్త) : పశువైద్య శిబిరాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందని, రైతులంతా గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ భలే యేసు రాజు అన్నారు. మంగళవారం కైకలూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వారి ఆర్థిక సహాయంతో కొట్టాడ గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి 28 రైతులకు సంబంధించిన 64 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఆరోగ్య సమస్యలున్న 44 పశువులకు రక్త పరిక్ష మరియు పేడ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. పశు వైద్య శిబిరానికి తీసుకొచ్చిన ప్రతి పశువుకు ఉచితంగా 1 కే.జి.మినరల్ మిక్చర్ ప్యాకెట్ మరియు అర లీటరు క్యాల్షియం అరకు పంపిణీ చేసారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర వడ్డీ సాధికారక కన్వీనర్ బలే ఏసురాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పశువుల యాజమాన్యంలో పూర్తి శ్రద్ధ వహించాలని, పశువులు కొల్లేరులో తూడు తింటున్నందున 3 నెలలకొకసారి ప్రతి పశువుకు జలగ మందు తప్పనిసరిగా పట్టించాలని, గ్రామం తరపున పాల కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటే పాలకు అధిక ధర పొందవచ్చని తెలిపారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఏ.డి. ఎ. కిషోర్ మరియు సెక్రటరీ ఖాజా అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ తాము ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పాడి రైతుకు లబ్ధి చేకూర్చే ప్రక్రియలో భాగంగా పశు సంవర్ధకలో జరుగు పశు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ప్రాంతీయ పశు వైద్య శాల, కైకలూరు సహాయ సంచాలకులు డా. పి. ముస్తఫా ఖాన్ మాట్లాడుతూ 90 శాతం ఖచ్చితత్వంతో పెయ్యదూడలనే జన్మనిచ్చే లింగ నిర్ధారిత వీర్యంతో తమ పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని తద్వారా రైతు ఎన్నో రెట్లు ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ సబ్సిడీగా రూ. 525/- లు భరిస్తుందని మరియు రైతు వాటా కేవలం రూ. 150/- మాత్రమేనని తెలిపారు. పశువులను కొల్లేరులో ఉదయం 6 గంటలకే మేతకు వదిలి ఎండ తీవ్రత పెరగకముందే అంటే ఉదయం 11 గంటలలోపు తిరిగి ఇంటికి చేరేవిధంగా చూసుకొనవలెనని అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు మేతకు వదిలి 7 గంటలలోపు ఇంటికి చేరేటట్లుగా జాగ్రత్త వహించవలెనని తెలిపారు. పశువులు వడదెబ్బ బారిన పడకుండా రోజుకు 2-3 సార్లు తప్పనిసరిగా నీళ్ళతో కడగాలని, ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చెట్ల నీడలో గానీ పశువుల పాక/షెడ్ లో కట్టవలెనని సూచించారు. కార్యక్రమంలో డా. నున్న ఫణీంద్ర బాబు, శ్రీ చంద్రబాబు, కొట్టాడ పశు సంవర్ధక సహాయకుడు శ్రీ గోపాల కృష్ణ, ఏ.ఎం.సి. సూపర్వైసర్ కే.యన్.వి. శ్రీనివాసరావు ఇతర పశు సంవర్ధక శాఖ మరియు ఏ.ఎం.సి. సిబ్బంది పాల్గొన్నారు.

# పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి :కార్యదర్శి పరమానందరావు

మొగల్తూరు మార్చి 24 (ప్రభాతవార్త ) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామంలో ఇంటి పన్ను వసూలు నూటికి నూరు శాతం వసూలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు మొగల్తూరు గ్రామ కార్యదర్శి బండారు పరమానందరావు అన్నారు. మంగళవారం మొగల్తూరు పేట పల్లం ప్రాంతంలో ఆయన పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటి పన్ను వసూలుకు ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు గ్రామంలో ఇంటి పన్ను వసూలు ప్రస్తుతం 98 శాతం పూర్తయినట్లు తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి నూటికి నూరు శాతం పన్ను వసూలు చేసేందుకు పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే వాటర్ టాక్స్ విధానంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని ఆయన తెలిపారు.



# సూర్య ఘర్ విజయవంతం చేయండి

## -కలెక్టర్ నాగరాణి



భీమవరం మార్చి 24 ప్రభాతవార్త : పీఎం సూర్య ఘర్ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందని, లక్ష్యానికి మించి ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య గర్ పథకం పురోగతిపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సోలార్ ప్యానల్స్ అమరిక జరగకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా భీమవరం, ఆకివీడు, పాలకోడేరు సబ్ డివిజన్ల పనుల పురోగతి తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్యానల్స్ ఏర్పాటు పురోగతి మందగించడానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం సూర్య గర్ పథకం కింద గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడమే కాకుండా పునరుత్పత్తి శక్తి వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. భీమవరం, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సోలార్ యూనిట్ల స్థాపనను అత్యవసరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేయాలని, ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఈ పథకం వైపు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి సబ్సిడీల వివరాలు, దరఖాస్తు విధానం గురించి పూర్తి సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. అలాగే పథకం అమలులో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా సమస్యలను తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. అలాగే ఎస్సీ లబ్ధిదారుల గృహాలకు సోలార్ ప్యానల్స్ అమరిక లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ఈఈలు ఎన్.వెంకటేశ్వరరావు, కె.నరసింహమూర్తి, కె.మధుకుమార్, ఏడీఈలు ఏ.సతీష్, టి.వెంకటేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, సి. హెచ్.రామకృష్ణ, డి.రాజీవ్, డి.రామకృష్ణ, బి.దివాకర్, ఎస్.రామకృష్ణ, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బాలత్రిపుర సుందరికి పుష్పాలంకరణ



భీమవరం మర్చి 24 ప్రభాతవార్త :వసంత నవరాత్రులను పురస్కరించుకుని 5వ రోజు సోమవారం భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ చే అమ్మవారికి ప్రత్యేక పూజలను, కుంకుమార్చన, లలిత సహస్ర నామాలు, నిర్వహించారు. వాసంశెట్టి చంద్రశేఖర్, సీతాలక్ష్మి దంపతులచే అమ్మవారికి పూజలు చేసి గులాబీ, బంతిపూలతో అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం



అత్తిలి/ గణపవరం, మార్చి 24 (ప్రభాత వార్త )ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సిబ్బందికి అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కే .ఓంకార్ నాథ్ మాట్లాడుతూ ఈ వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాల నుంచి దగ్గు ,సాయంత్రం పూటల జ్వరం ,ఆకలితగ్గడం ,బరువు తగ్గడం ,ఉన్నట్లయితే క్షయవ్యాధి లక్షణాలు గా గుర్తించి ఆరోగ్య కేంద్రంను సందర్శించి టీబి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు పూర్తి చికిత్స తీసుకున్నట్లయితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతినెల వెయ్యి రూపాయలు పోషణ నిమిత్తం అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ, టిబి మీకాబాక్టీరియా ట్యూబర్క్యులోసిస్ ద్వారా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,హెచ్ వి సి.పద్మజ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు .

# శ్రీ వెంకటేశ్వర స్వామి అన్నదాన భవన నిర్మాణానికి

## దాతల సహకారం అభినందనీయం



కాళ్ళ మార్చి 24 (ప్రభాతవార్త) :అన్నదాన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేయటం ఆనందదాయకమని ధర్మకర్త మండలి అధ్యక్షులు అడ్డాల వెంకట శివరామరాజు అన్నారు . మండలంలోని కాళ్ళకూరు స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం అన్నదాన భవన నిర్మాణానికి దుంపగడపకు చెందిన చింతలపాటి కొండరాజు కుమారుడు చింతలపాటి సీతారామరాజు మాధవి లత దంపతులు రూ:1,01,116/- లు (అక్షరాల ఒక లక్ష వేయి నూటపదహారు రూపాయలు) మాలవానితిప్పకు చెందిన మంతెన శివరామకృష్ణం రాజు రూ. 30,000/-( ముప్పై వేల రూపాయలు) అందజేశారు. ఈసందర్భంగా శ్రీ స్వామివారి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు అడ్డాల శివరామరాజు, కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ధర్మకర్తలు దాతలను అభినందించి వారికి స్వామి వారి శేష వస్త్రం ప్రసాదములు అందజేశారు.

# ఎంపీ పుట్టా మహేష్ కోసం దేనికైనా రెడీ

## ధీమా వ్యక్తం చేస్తున్న కైకలూరు బిసి నేతలు



కైకలూరు మార్చి 24 (ప్రభాతవార్త): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కోసం కైకలూరు నియోజకవర్గ బిసి వర్గాల ప్రజలు అందరూ దేనికైనా సిద్ధం ఉన్నారని బిసి సంఘాల నేతలు పిలుపునిచ్చారు.మంగళవారం కైకలూరు పట్టణంలోని ఓ బిసి నేత ఇంటి వద్ద జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునేని వరప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు బిసి నేతలు.. యం పి. పుట్టా మహేష్ కుమార్ కి సంఘీభావం వ్యక్తం చేసారు. సభా అధ్యక్షులు గంగునేని వరప్రసాద్ మాట్లాడుతూ పుట్టా మహేష్ కోసం ఈ రోజు పార్టిలకు అతీతంగా ఇంతమంది బిసి నేతలు హజరు అయ్యారు అంటే.. వైసిపి నేతలు అర్థం చేసుకోవాలని,కైకలూరు నియోజకవర్గ బిసి వర్గాల ప్రజలు అందరూ పుట్టా కోసం దేనికైనా సిద్ధం ఉన్నారని ఒక్క కైకలూరే కాకుండా ఏలూరు పార్లమెంటు పరిధిలో ని వివిధ కులాల సామాన్య ప్రజలు. బిసి సంఘాలు అందరూ పుట్టా మహేష్ వెంటనే ఉన్నారని ,అయన కోసం దేనికైనా సిద్ధం గా ఉన్నారని అన్నారు.ఈ రెండు సంవత్సరాల లో అయన చేసిన అబివృద్ధి చూసి ఓర్వలేని వైసిపి నేతలు పెటియమ్ బ్యాచ్ తో షోషల్ మీడియా లో తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారన్నారు.ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా నిజం నిప్పు లాంటిది అని,మా యం పి. పుట్టా కడిగిన ముత్యం లా తిరిగి వస్తారని,అయన కోసం ఏలూరు పార్లమెంటు నుంచి వేలాది మంది ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ని కలవడానికి సిద్ధంగా ఉన్నామని గంగునేని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొమ్మనబోయిన విజయలక్ష్మి, బీసీ సంఘ నాయకులు కట్టా గోపి,బోయిన రామకృష్ణ,బలే చిరంజీవి, కట్టా పెదరాఘవులు,సైదు అనంద్ బాబు,జక్కుల విజయ్,తుపాకుల సోమాచారి,మోదుగుమూడి లక్ష్మయ్య, తలారి రామారావు,బోల్లా శ్యామలరావు,గొర్లి శివ,వేగిరెడ్డి సురేష్, మీగడ శివకృష్ణ,కిలాడి నాగేంద్ర,ధర్మరాజుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ప్రత్యేక బస్సు

తణుకు, మార్చి 24 ( ప్రభాత వార్త )శ్రీరామ నవమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తణుకు డిపో నుండి 26 వతేది రాత్రి 8 గంటలకు భద్రాచలం కు సూపర్ లక్సరీ వీడియో కోచ్ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ సుధారాణి తెలిపారు. టికెట్ పెద్దలకు 380 రూపాయలు,పిల్లల కు 210 రూపాయలు ఛార్జ్ అని, రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని తెలిపారు. భద్రాచలం నుండి తిరిగి కళ్యాణం అనంతరం ఈ బస్సు తణుకు కు బయలు దేరుతుందని ఈ అవకాశం ను తణుకు పరిసర ప్రాంత భక్తులు వినియోగించు కోవాలని డిపో మేనేజర్ సుధారాణి కోరారు..

## ప్రతికుటుంబానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలి
### -కలెక్టర్ నాగరాణి

భీమవరం మార్చి 24, ప్రభాతవార్త :జిల్లాలోని ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించే లక్ష్యంతో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కృషి చేయాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సున్నితంగా హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జల జీవన్ మిషన్ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు, మెయిల్ ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని, పైపులైన్ల నిర్మాణంలో అన్ని శాఖలతో సమన్వయం ఉండాలని సూచించారు. ప్రత్యేకంగా ఆర్ ఎ బి రహదారులు, కాలువల వెంబడి పైపులైన్ పనులు చేపట్టేటప్పుడు సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో పనులు జరగాలని తెలిపారు. పైపులైన్ల నిర్మాణంలో ఆక్రమణలు అడ్డువస్తే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని, వాటి తొలగింపునకు రెవెన్యూ, పోలీస్ శాఖల ద్వారా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో రూ.1400 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులు పూర్తయితే 16 మండలాల్లోని 862 గ్రామాలకు సమగ్ర త్రాగునీటి సౌకర్యం అందుతుందని పేర్కొన్నారు. తదనంతరం నిర్వహించిన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశంలి లో కలెక్టర్



మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీటి సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచి, శుభ్రపరిచిన తేదీని బోర్డుపై నమోదు చేయాలని ఆదేశించారు. త్రాగునీటి కొరత ఎక్కడా లేకుండా చూడడంతో పాటు క్లోరినేషన్ చేసిన స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తు చేసి నీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. కలుషిత నీటి కారణంగా డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఇ కె. శ్రీనివాస్, ఆర్ ఎ బి ఎస్.ఇ ఎస్. శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఎస్.ఇ పి. ఉషారాణి, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, మెయిల్ గుత్తేదారుడు పీతల వాసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటం
### - అదుపుతప్పితే అంతే సంగతులు

ప్రభాతవార్త చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయి నుండి నరసాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైన ఆర్ అండ్ బి అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు. ఈ రోడ్డులో గోతులతో పాటు మార్జిన్ లో కూడా గోతులుగా మారడంతో ఆదమరిస్తే అంతే సంగతులు గా తయారైంది. ఒకపక్క రోడ్డు లో గుంతలు, మరో పక్క మార్జిన్ బాగుండకపోవటంతో ఎంతోమంది ప్రయాణికులు అదుపుతప్పి ప్రమాదాలకు గురి అయ్యారు. నిత్యం ఈ రోడ్ లో వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. భారీ వాహనాలు కూడా అనుమతి లేకపోయినా ఈ రోడ్డులోనే చాట్రాయి మీదుగా చింతలపూడి వెళ్తూ ఉండటంతో ఈ రోడ్ లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. అసలు ఆర్ అండ్ బి అధికారులు కనీసం రోడ్లు పరిశీలన కూడా చేయటం లేదని ప్రమాదాలు జరిగినప్పుడైనా రోడ్డును పరిశీలించాల్సిన బాధ్యత లేదా అని



ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల గోతులు పూడ్చేందుకు ప్రయత్నించిన అధికారులు రెండు మాసాలు పూర్తయిన నేటికీ పూడ్చలేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి ఉన్నత అధికారులు స్పందించి రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

## పెన్షనర్లు నిరసన కార్యక్రమంలో పాల్గొనండి

అత్తిలి,మార్చి 24 (ప్రభాత వార్త ) కేంద్ర ప్రభుత్వం పే రివిజన్ చేసే సమయంలో ఓ పి ఎస్ పెన్షనర్లు పే రివిజన్ సదుపాయం కోల్పోయేలా తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో పెన్షనర్లు పాల్గొనాలని స్థానిక పెన్షన్ల సంఘం వారు కోరారు. రిటైర్ అయిన ఉద్యోగులకు నష్టం కలిగించే వేలిడేషన్ చట్టం ను గత సంవత్సరం మార్చి 25న రాష్ట్రపతి ఆమోదించాలని తెలిపారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తప్పక అమలు చేస్తాయని అన్నారు. అందువల్ల పెన్షనర్లు మార్చి 25 ను బ్లాక్ డే గా గుర్తించి నల్ల బ్యాడ్జీలతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ప్రధానమంత్రిని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## వీఆర్వో గ డీ చిన్న బాధ్యతల స్వీకరణ

మొగల్తూరు మార్చి 24(ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలో వి.ఆర్.ఓ.గ డి చిన్న మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెనుగొండ పట్టణం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పేరుపాలెం వీఆర్వో టి దుర్గారావు లంచం తీసుకుంటున్నారని ఒక మిలటరీ ఉద్యోగి ఉన్నత అధికారులకు మీడియాకు ఫిర్యాదు చేయడంతో దుర్గారావు పై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారులు గుర్తించి దుర్గారావును బాధ్యతలు నుండి తాత్కాలికంగా తప్పించారు. ప్రస్తుతం పెనుగొండ నుండి వచ్చిన విఆర్వో డి. చిన్న మంగళవారం మండల తాసిల్దార్ కే రాజ్ కిషోర్ ను కలిసి అనంతరం పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలో వీఆర్వోగా బాధ్యతలు తీసుకున్నారు.



## పాఠశాలకు ఇన్వర్టర్ బహుకరణ

అత్తిలి /గణపవరం,మార్చి 24( ప్రభాత వార్త )గణపవరం మండలం జల్లికొమ్మర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షులు ఏలూరు పట్టణ వాస్తవ్యులు జల్లా వీరభద్ర రావు వెంకట సత్య ధర్మవతి దంపతులు పాఠశాలకు 30 వేల రూపాయల విలువైన ఇన్వర్టర్ బహుకరించారు. వారిని పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు పివిఎస్ ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు గ్రామ



పెద్దలు గ్రామ సర్పంచ్ కే. వెంకటరత్నం, కవల కోదండ రాంబాబు గారు మద్దాల మహంకాళి, ఎంపీటీసీ సభ్యులు బుద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు

అత్తిలి/ గణపవరం,మార్చి 24( ప్రభాత వార్త )గణపవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో చిన్నారుల పై లైంగిక వేధింపుల నివారణ పై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం తణుకు జిల్లా ఆసుపత్రికి చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ . కృష్ణా రెడ్డి నిర్వహించారు. డాక్టర్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల పై లైంగిక వేధింపులు ఏ ఏ రూపాలలో జరిగే అవకాశం ఉంది వాటిని ఏ విధంగా తగ్గించగలమో తెలిపారు. లైంగిక వేధింపులు జరిగితే దాని ప్రభావం చిన్నారులు పై శారీరకంగా, మానసికంగా ఏ రకంగా ఉంటుంది వీటికి అవసరం అయిన చికిత్స తణుకు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లో అందుబాటులో ఉన్నట్టుగా తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. రాగిణికుమార్ పోక్సో యాక్ట్, జేజే యాక్ట్ వంటి చట్టాల గురించి వివరించారు.



సబ్ ఇన్స్పెక్టర్ ఎ. మణికుమార్, ఎం ఈ ఓ జి.బాలయ్య,డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ బాబు, డిప్యూటీ మండలపరిషత్ అభివృద్ధి అధికారిశివాజీ, జి. విజయ లక్ష్మీ, జి. చంద్రావతి, గంటా వీర వేణి, ఉపాధ్యాయులు, మహిళ పోలీసు, ఐసిడిఎస్, ఆశా వర్కర్స్, అంగన్వాడిస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీల అమలుకై డిమాండ్

వేలేరుపాడు, మార్చి 24 (ప్రభాత వార్త ): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వేలేరుపాడు సిపిఐ కార్యాలయం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎమ్మార్వోకి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్ సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము నాయకులు బంధం నాగేశ్వరావు మడివి కామయ్య పిట్టా వీరయ్య కరటం వెంకటేశ్వర్లు బుడిబుటి జానుబాబు బంధం రమాదేవి మడకం విజయ్




గడుపుల భీమరాజు కాకా ముత్యాలరావు పిట్ట జయ బంధం సుక్కమ్మ బంధం జ్యోతి సోడే చినమ్మి పెదకం వెంకటేశ్వరావు మడకం దుర్గారావు కుంజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొండల రాయుడికి అభిషేకాలు



అత్తిలి, మార్చి 24( ప్రభాతవార్త )అత్తిలి శివారు గంటా వారి పుంత లో గల కొండల రాయుడు ఆలయ వద్ద నెల షష్టి సందర్భంగా కొండల రాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో గల నాగేంద్రుని పుట్ట వద్ద ప్రత్యేక అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మంగళవారం పంచముఖ ఆంజనేయ స్వామి ప్రత్యేక అలంకరణ,



పెనుమంట్ర , మార్చి 24, (ప్రభాతావార్త): మండలంలోని మార్టేరు జెడ్ వంతెన సమీపంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామివారిని పంచముఖ అవతార అలంకరణలో భక్తులకు తెల్లవారుజాము నుంచే దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా హనుమాన్ యువజన సేవా సంఘం సభ్యుడు కర్రీ అచ్యుత రామారెడ్డి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అర్చకులు విజయగోపాలాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ అలంకరణకు సహకరించిన కమిటీ సభ్యులు, దాతలు మరియు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## క్షయ వ్యాధి దినోత్సవ ర్యాలీ



ఆగిరిపల్లి: మార్చి 24 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆగిరిపల్లి, సగ్గూరు, ఈదర ప్రాథమిక వైద్యశాలలో మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి గ్రామస్తులు, రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ జగన్ మోహన్ రావు, డాక్టర్ మంజులా దేవి, డాక్టర్ సునందలు టీబీ (క్షయ వ్యాధి) గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధి అని, దగ్గు తుమ్ముల ద్వారా బాక్టీరియా ఇతరులకు చేరుతుందని తెలిపారు. ముందుగానే గుర్తించి వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని, శుభ్రత, పోషకాహారం, రోగనిరోధక శక్తి పెంపుతో ఈ వ్యాధిని నివారించవచ్చని వివరించారు.

## ఆలయాల నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయం



కాళ్ళ మార్చి, 24( ప్రభాత వార్త) : దేవాలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ, దేవాలయాల పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని దొడ్డనపూడిలో శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ పార్వతి సమేత చంద్రమౌళీశ్వర దేవస్థానములు పుననిర్మాణం చేశారు. గ్రామస్తులు దాతల విరాళాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ నిధులు తో సుందరంగా నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు- శ్రీదేవి పద్మజ దంపతులు రూ.16,82,000/ - లు విరాళము చేశారని గ్రామస్తులు, ఆలయ కమిటీ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## గ్యాస్ కొరతతో నిలిచిపోయిన చిరుతిండి వ్యాపారాలు

పెనుమంట్ర, మార్చి 24, (ప్రభాత వార్త) : మండలంలోని మార్టేరులో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. నిత్యం రద్దీగా ఉండే చిరుతిండి బండారాలు, టిఫిన్ సెంటర్లు మూతపడటంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఇక్కడ పదుల సంఖ్యలో వివిధ రకాల ఆహార పదార్థాలను విక్రయిస్తారు. అయితే గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో వ్యాపారాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి పరిసర గ్రామాల్లో కూడా కనిపిస్తోంది. రోజువారీగా ఈ వ్యాపారాలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునే చిన్న వ్యాపారులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారితోపాటు అక్కడ పనిచేసే కార్మికులకు కూడా ఉపాధి లేకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. వాస్తవానికి సిలిండర్ల కొరత ఉన్నట్టు బయటకు కనిపించినప్పటికీ, కొందరికి మాత్రం అవి సులభంగా




లభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుకుబడి ఉన్నవారు లేదా అధిక మొత్తాన్ని చెల్లించగలవారికి రాత్రికి రాత్రే సిలిండర్లు అందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని పెద్ద రెస్టారెంట్లు, ప్రముఖ స్వీట్లు తయారీ కేంద్రాలకు మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా జరుగుతుండటం అనుమానాలకు తావిస్తోంది.

## బల్లిపాడు లో ఉచిత పశు వైద్య శిబిరం

అత్తిలి మార్చి 24( ప్రభాత వార్త )అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ సూచన మేరకు, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రైతులు, పశుపోషకులకు సుమారు 30వేలు విలువైన ఔషధాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటు అందడంతో పాటు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అత్తిలి మార్కెట్ యార్డ్ చైర్మన్ దాసం ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పుంత రోడ్ల నిర్మాణం కోసం కోటి 40 లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. నిర్మించే రోడ్లు పటిష్టంగా ఉండాలని శాసనసభ్యుని ఆశయం మేరకు రోడ్లు నిర్మించగలమని తెలిపారు. అత్తిలి మండలంలో మూడు రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి



చందు మాట్లాడుతూ ఏఎంసీ చైర్మన్ సొంతంగా అదనపు నిధులను ఖర్చు చేసి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు రైతులకు తెలియజేసి ప్రభుత్వ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీ చైర్మన్ నల్లూరి సురేష్ , మండల టిడిపి కార్యదర్శి ఆల్తి అజయ్ , కూటమి నాయకులు గణేష్ , అశోక్ , ధర్మారావు , బల్లిపాడు సొసైటి ప్రెసిడెంట్ వి సత్తిబాబు ,ఆర్ సత్యవతి , మార్కెట్ యార్డ్ సెక్రటర్ ,, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీరు అందించడం అధికారుల బాధ్యత :ఏ ఈ బుజ్జేశ్వరావు

పోడూరు, మార్చి 24, ప్రభాత వార్త : వేసవి కాలంలో ప్రజలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పోడూరు మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పి. బుజేశ్వరరావు సూచించారు. తాగునీటి సమస్య ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పోడూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఐకెపి ప్రతినిధులకు తాగునీటి నాణ్యత పర్యవేక్షణపై ఒకరోజు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ బుజేశ్వరరావు మాట్లాడుతూ, చెరువుల ద్వారా శుద్ధి చేసి సరఫరా చేసే తాగునీటి వ్యవస్థల్లో ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, చెరువు ఆధారిత సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భంలో ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా తాగునీరు అందించేలా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలను ముందుగానే గుర్తించి, సకాలంలో మరమ్మతులు చేపట్టడం ద్వారా ప్రజలకు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన నీరు అందించవచ్చన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించే బాధ్యత పంచాయతీలపై ఉందని, నిర్వహణ మరియు సాంకేతిక అంశాల్లో అవసరమైన సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదేనని చెప్పారు. వేసవి తీవ్రత పెరిగేలోపు గ్రామాల వారీగా తాగునీటి వనరులను సమీక్షించి, ఎక్కడ సమస్యలు తలెత్తే అవకాశముందో ముందుగానే గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పడాల నాగిరెడ్డి, ఏవో శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్షౌరశాలలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి
### - విద్యుత్ శాఖ ఏడికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం వినతి

కామవరపుకోట,మార్చి 24(ప్రభాత వార్త): మండల పరిధిలోని నాయి బ్రాహ్మణ క్షౌరశాలలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ మంగళవారం కామవరపుకోట విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం అందించిన 150 యూనిట్లకు అదనంగా మరో 50 యూనిట్లు కలిపి మొత్తం 200 యూనిట్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అమలు కాకపోవడాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఏడీ సానుకూలంగా స్పందిస్తూ, ప్రస్తుతం రాయితీ పొందుతున్న షాపులను తక్షణమే పరిశీలించి, పెంచిన 200 యూనిట్ల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు



చిప్పాడ నరసింహారావు, పట్టణ అధ్యక్షులు చెడే నాగరాజు, కార్యదర్శి గన్నవరపు వెంకటాచలం, చెడే బద్రి, యూత్ ప్రెసిడెంట్ శీలారపు ప్రశాంత్ రాజ్, వీరభద్రరావు, కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అభివృద్ధి సంస్థలో చెట్లు నరికివేతపై విచారణ,

జీలుగుమిల్లి, మార్చి 24, (ప్రభాతవార్త) :మండలంలోని దర్భగుడెం బీట్ పరిధిలోని అటవీ అభివృద్ధి సంస్థ జామాయిల్ ప్లాంటేషన్ లో మారుజాతి చెట్లను నరికి అక్రమంగా రవాణా చేసిన ఘటనలో మంగళవారం ఆ సంస్థ డిఎం సౌజన్య విచారణ చేసి పెట్టారు. ఈ విషయాలు ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ ను విధుల నుండి ఇప్పటికే తొలగించారు. ఈ సందర్భంగా ఆమె ప్లాంటేషన్ ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అక్రమంగా జరిగిన చెట్లను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెట్లు తరలింపులో కిందిస్థాయి సిబ్బంది పాత్ర పై ప్రశ్నించగా, విచారణ జరుగుతుందని తెలిపారు. ఇటీవల రాజమండ్రి స్క్వాడ్ బృందం, స్క్వాడ్ డి ఎఫ్ వో శ్రీనివాసరావు



ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా భారీగా చెట్లు నరికివేసి ట్రాక్టర్ల ద్వారా తరలించినట్లు బయటపడింది. ఇదిలా ఉంటే ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బొత్సను కలిసిన చింతలపూడి వైసిపి కన్వీనర్ కంభం విజయరాజు

కామవరపుకోట,మార్చి 24(ప్రభాత వార్త): చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కంభం విజయరాజు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు,మంగళవారం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకుని విజయనగరం చేరుకున్న బొత్స ను కలిసి, విజయరాజు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతలపూడిని వైసీపీకి కంచుకోటగా మార్చేందుకు విజయరాజు చూపిస్తున్న పట్టుదలను కొనియాడారు. నియోజకవర్గంలోని కామవరపుకోట మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ పనితీరు బాగుందని అలాగే పార్టీ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని విజయరాజుకు బొత్స సూచించారు.. ఈ



కార్యక్రమంలో కామవరపుకోట మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, లింగపాలెం మండల పార్టీ అధ్యక్షులు అన్నపనేని శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి సమస్యపై ఉద్యమిస్తాం : జె ఎన్ వి గోపాలన్

భీమవరం టౌన్ మార్చి 24 : ప్రభాతవార్త : జిల్లా పాదయాత్రను జయప్రదం చేసిన ప్రజలకు, సహకరించిన దాతలకు, సంఘీభావం తెలిపిన సంఘాలు, సంస్థలకు సిపిఎం జిల్లా కార్యదర్శి జే ఎన్ వి గోపాలన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా వ్యాప్తంగా సీపీఎం చేపట్టిన జిల్లా ప్రజా చైతన్య పాదయాత్ర 20మండలాలు, 6పట్టణాలు మేర సాగిందని తెలిపారు. 270 గ్రామాలు, వార్డుల్లో కొన్ని వందల వీధుల్లో ప్రజలను కలిసి వారి సమస్యలను గుర్తించామన్నారు. 26రోజులు పాటు సాగిన ఈ పాదయాత్రలో ప్రజల సమస్యలు, వారి బాధలు వర్ణనాతీతం అన్నారు. ప్రతీ ఒక్కరి సమస్యపై ఉద్యమిస్తామని గోపాలన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికై జిల్లా అధికారులు హామీ ఇచ్చారని త్వరలోనే సిపిఎం జిల్లా బృందం జిల్లా కలెక్టర్ ను కలిసి ప్రతీ సమస్యను వివరిస్తామని తెలిపారు. ప్రతి మండలంలో సిపిఎం పోరాటాలను ఉధృతం చేస్తుందన్నారు. పాదయాత్ర ముగింపు సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరి కన్నీరు చూసామని, వారు చెప్పిన సమస్యలు విన్నామని త్వరలోనే అన్ని సమస్యల పరిష్కారానికై అందరం కలిసి ఐక్యంగా




ఉద్యమిద్దాం అని పిలుపునిచ్చారు.